ఆదివారం
ఆంధ్రజ్యోతి
15, సెప్టెంబర్
1991
5

15/9/91

అస్థింగోవి

కథాలాపన

8/9/91

ఒక బండరాయి మీద బండబారి కూచుని చూస్తున్న నాకు ఆ యేరు తీరొక్క తీరుగా కనిపిస్తోంది. వొకసారి శవాల వూరేగింపులా కనిపిస్తుంది. అంతలోనే కన్నీటి పెను ప్రవాహంలా మారిపోతుంది. చిటికెలో పోటెత్తిన రక్తపు యేరులా పారుతుంది. మరి కాసేపట్లో నా మీద యెవరో భాగ్యశాలి చూపించే సామభూతి స్రవంతిలా అగుపిస్తుంది. అలా కనిపించినప్పుడు మనసు నెమ్మదిస్తుంది.

యేటికి ఆవలి వొడ్డున దూరంగా కొండలు, దట్టమైన అడవి. నా ఆలోచనలకి మల్లే అల్లుకున్న దుర్గ మాటవి. అక్కడ కొండల మాటున సూర్యుడు ఆఖరి చూపులు చూస్తున్నాడు. కాసేపట్లో సూర్యుడు అస్తమిస్తాడు. వెలుగును వెంట తీసికెళ్తాడు. చీకటి కమ్మేస్తుంది. దుక్కంలా చీకటి తన్నుకొస్తుంది. భయంలా చీకటి వ్యాపిస్తుంది.

యెక్కడ లేని వొంటరితనం ఆవహించింది నన్ను.

సరిగ్గా అప్పడే నాకతడు కనిపించాడు. యేటిమీద నడుస్తూ అతడు సూర్యుడిలోంచి వొస్తున్నాడు. సగం వరకు పర్వతం వెనక్కి, దిగిన సూర్యబింబం అతని శిరస్సు చుట్టూ కాంతి కైవారాన్ని కట్టింది. పెద్ద పెద్ద అంగలు వేస్తూ అతను నా వైపుగా నడిచి వొస్తున్నాడు. నిద్రలేచిన పురాతన వుక్కు విగ్రహంలా వున్నాడు. గాలిలో తేలి తేలి వొస్తున్నాడు. అతని తల చెదిరిపోయిన గడ్డివాములా వుంది.

అతను నా దగ్గరగా వొచ్చాడు.

నా గుండె వేగంగా కొట్టుకోసాగింది.

నన్ను దాటిపోబోతూ అతను నా వైపు వోరగా చూశాడు. అతను నా కిప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నాడు. బలమైన విగ్రహం. అసాధారణమైన ఆజానుబావుడు.

బాగా పెరిగి రేగిపోయిన జుట్టు, పొడవైన గడ్డం. ఇదీ అని చెప్పలేని వొంటి రంగు. గౌరవర్ణానికి దగ్గరగా వుంది. భుజం మీద నల్లని గొంగడి, మొలకు కౌపీనం తప్ప వొంటి నిండా నగ్నత్వం. చేతిలో దుడ్డు కర్ర. కాళ్ళకి దళసరి తోలు చెప్పులు. కళ్ళు తేజోవంతంగా వున్నాయి. చూపులు సూటిగా వున్నాయి.

అతను నా వైపు తిరిగాడు. ములుగర్ర బలంగా నేలకానింది. రెండు చేతులూ ములుగర్రపై వుంచి వాటిపై చుబుకం ఆనించి నా వైపు నిదానించి చూస్తూ.

"యెవరు నాయనా నీవు ? ఇలా గాలిలో దీపంలా కూచుని వున్నావు?" అడిగాడు. ఆ కంఠంలో ధ్వనించిన అనాది జీరకి వాతావరణం కంపించింది. నా వెన్నులో పాముకటి జరజరా పాకింది. యేదో భయం నా తల మీద పడగ విప్పింది. గొంతు పెగల్లేదు. మాటరాలేదు.

"యెందుకలా వొణుకుతున్నావు? జ్వరమా? భయమా?"

అతని గరుకైన అరచేయి నా ఫాల భాగాన్ని తాకింది. యేదో తెలియని వుపశమనం. అయినా భయం! ఆ స్పర్శలో తొలినాటి స్మృతులేవో తొణికిన సవ్వడి. అయినా బుగులు. మాటా పలుకూ లేకుండా మూగవాడిలా వెర్రి చూపులు చూస్తుండి పోయాను.

"భయం లేదు. చెప్ప నాయనా? యెందుకిలా దిగులుగా కూచుని వున్నావు?"

అనాది జీరలో ఆత్మీయధార! ఆప్తవాక్యం నన్ను భుజం తట్టినట్టయింది.

"మ్మి...మ్మి...మ్మీరెవరు?"

మూతిలోంచి నా గొంతుక పలికింది. నా బలహీన స్వరం నాకయినా వినిపించిందా?

నా ప్రశ్న అతని వికటాట్టహాసంలో కలిసి పోయింది.

గాలి వుండలు చుట్టుకు పోయింది. నాకు వూపిరాడలేదు. గట్టిగా వూపిరి పీల్చుకుని మళ్ళీ అడిగాను.

అతనీసారి నవ్వలేదు.

"నేను నీడలేని నిప్పుని. అంటరాని పెనుమంటని"

నాకు అతని మాటలు అర్థం కాలేదు.

"అర్థం కాలేదా? నన్ను పోల్చుకోలేదా?"

కాలేదన్నట్టు తలూపాను.

"నేను శంబూకుడను"

నేను అదిరిపోయాను. అదేం పేరు? యెక్కడో విన్నాను. యెక్కడ? యెక్కడ? యెప్పుడు? గుర్తుకు రావడం లేదు. పరిచయస్తుడికి మల్లేనే వున్నాడు. అంతటి వుద్విగ్నతలోనూ నా బుర్ర పని చేస్తోంది. ముప్పయి మూడు కోట్ల సందేహాలు. పోటెత్తుతున్నాయి.

"అవును నాయనా? నా పేరు శంబూకుడు. నేను జగమెరిగిన ఛండాలుడను"

"నాకు, గుర్తొచ్చింది. వెంటనే అడిగాను. "రాముడు చంపేసిన శంబూకుడు మీరేనా?"

"నన్నిప్పుడు యెవ్వరూ చంపలేరు నాయనా!" అతని మాట తీరు వింతగా వుంది. "నీ ప్రశ్న గత కాలానికి సంబంధించింది. నా సమాధానం వర్తమానం!" మరింత వింతగా అతని మొహంలోకి చూశాను.

యెక్కడి నుంచి వొస్తున్నారు?"

"అనాది నుంచి"

"ఎక్కడిదాకా పయనం?"

"అనంతాల దాకా"

అతనితో సంభాషణ నాలో భయాన్ని తొలగించింది. వుద్విగ్నత సడలి పోయింది. రాత్రయినా పగటిలానే వుంది. సూర్యుడు అస్తమించినా వెలుతురు పోనట్టుంది. యేరు మీంచి వీస్తున్న చల్లని గాలి హాయిగా వుంది. నా వొంటి మీదికి స్పృహ వొచ్చింది. అతనితో నా అపరిచయం అంతరించింది.

"అవునూ, నువ్విలా వొంటరిగా యెందుకు కూర్చున్నావు నాయనా? అది చెప్పవేం?" అతను చనువుగా అడిగాడు, ఆ మాటల్లో మాతృ స్పర్శ!

నేను వెంటనే సమాధానం చెప్పలేకపోయాను. యెదురుగా పారుతున్న యేరు వైపు దిగులుగా చూశాను. నా కళ్ళల్లో ప్రవహించింది యేరు!

"నేనిప్పుడు ఆ యేరు వెంటబడే వొస్తున్నాను. ముక్కలు ముక్కలుగా కొట్టుకు వొచ్చాను" అన్నాడతను. నా మాటలే అతను చెప్తున్నాడు. నా మనసును చదివినట్టుంది. ఆశ్చర్యంగా, ఆరాధనగా అతని వైపు చూశాను. ఆపాదమస్తకం కనులారా అతని స్వరూపాన్ని చూశాను. అతను వెలుగు లీనుతున్నాడు. తేజోమూర్తిలా వున్నాడు. అతని చేతిలో తెల్లని కర్రలాంటి వొస్తువేదో కనిపించింది.

"యేమిటిది?" అడిగాను.

"కావాలా? తీసుకో" అంటూ ఆ వస్తువును నాకు బహూకరించాడు. తెల్లని కర్రలాంటి ఆ వస్తువు వొంటి నిండా రంధ్రాలున్నాయి.

"యేమిటిది? ఇలా వుందేం?"

"వేణువు"

"వేణువయితే ఇలా తెల్లగా వుందేమిటి? ఇన్ని రంధ్రాలున్నాయేమిటి?" అడిగాను.

"అది మనిషి యెముకతో చేసింది"

"తుళ్ళి పడ్డాన్నేను.

"యెముకతోనా?" నా మాటల్లో వినిపించిన అంతులేని ఆశ్చర్యాన్ని చూసి ఆయన పెదవుల మీద చిరునవ్వు మెరిసింది.

"అవును. యెముకతో చేసింది."

"ఇంతకీ ఇది యే కాలం నాటిది? యే దేశానికి చెందినది?"

"ఈ కాలం నాటిదే. ఈ దేశం నాటిదే. నాకు చుండూరు గ్రామం నడిబొడ్డున వెలసిన శ్మశానంలో దొరికింది"

"మరి ఇన్ని రంధ్రాలున్నాయేమిటి?"

"యెన్నున్నాయో లెక్క బెట్టు" అన్నాడతను - సరదాగా.

లెక్క పెట్టాను. "22 వున్నాయి'

"సరిగ్గా లెక్క పెట్టు" అతని గొంతులో అదో రకం నవ్వు.

మళ్ళీ లెక్క పెట్టాను. "21 వున్నాయి"

"మరోసారి లెక్క పెట్టు"

మరోసారి లెక్క పెట్టాను "8 వున్నాయి"

నాకంతా అయోమయంగా వుంది.

శంబూకుడు నవ్వాడు.

"అదంతే నాయనా! లెక్క తేలదు"

"మరెలా?"

"రంధ్రాలెన్నయితేనేం! రాగమొకటే! వాయించు" నేను బిత్తరపోయాను.

"ఫరవాలేదు వాయించు. నీకీ వేణువు బహూకరిస్తున్నాను. వుంచు" అంటూ అతను వెళ్ళిపోబోయాడు. మళ్ళీ ఆగి "గుర్తుంచుకో. వాయించడం మొదలు పెట్టాక ఆపకు. నువ్వాపినా అది ఆగదులే" అని అంటూ శంబూకుడు వెళ్ళిపోయాడు. వెలుతురు వెళ్ళిపోయింది.

చీకట్లో వేణువుతో నేను మిగిలిపోయాను.

అపురూపమైన ఆ వేణువును గట్టిగా పట్టుకున్నాను. నా వొంట్లో విద్యుత్తు ప్రవహిస్తోంది. వేణువుని పెదాల కానించాను. యెంత వూదినా శబ్దం రాలేదు. నాలో పట్టుదల హెచ్చింది. విశ్వ ప్రయత్నం మీద వేణువు పలికింది. పలకలేదు. గర్జించింది. వేయి శంకువులు, కోటి కొమ్ములు ముక్కోటి గొంతులు యేకమైనట్టు భీకర శబ్దం. భూనంభోంతరాళాలు కంపించాయి. బ్రహ్మాండ బాండం బద్దలైనట్టు భయానక నాదం. నేను భరించలేకున్నాను. శంబూకుడు "ఆపొద్దు" అన్నమాట గుర్తొచ్చి ఆపలేదు. శబ్దం పెద్దదయింది. నాదం ప్రపంచ ప్రజలందరి నినాదంలా వుంది. గంటలు మోగుతున్నాయి. యముని మహిషపు లోహగంటలా? గంటలు గంటలు ... మంటలు మంటలు పెనుమంటలు. సెగలు సెగలు పొగలు పొగలు ప్రపంచం దగ్ధమై పోతోందా? అగ్ని దగ్ధ వాతావరణంలో నాలో భయ ప్రకంపనలు. నా కళ్ళ ముందు లోకం వొక అగ్ని గుండంలా మారింది. యెవరో యెవరెవరో మనుషులు వొచ్చి అందులో పడిపోతున్నారు.

ఇక నాకు శక్తి చాలలేదు. వూదడం ఆపి వూపిరి పీల్చుకోబోయాను. వూపిరాడలేదు. ఇళ్లు కాలిపోతున్నాయి. మనుషులు కాలిపోతున్నారు.

యెవరు వీళ్ళంతా?

"హంతకులు. హంతకులు. హంతకులు" అని అశరీర వాణి పలికింది. అది శంబూకుడి గొంతు!

– కె. నరసింహాచారి

వినువీధిలో ప్రధానులు

గతంలో ప్రధాన మంత్రులుగా పని చేసిన వాళ్లు 'కళ్ళు నెత్తికెక్కి' ఆకాశం వైపు ఎలా చూపులు విగిడించారో వారి విమాన ప్రయాణ ఖర్చులు చూస్తే తెలుస్తుంది. అధికారిక కార్యక్రమాల కోసం వారు విమానాలు వాడుకోవడం పక్కన పెడితే వ్యక్తిగత అవసరాల కోసం లక్షలు, కోట్ల రూపాయిల్లో ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారు. వీలయినంత ఎక్కువసేపు వినువీధిలో విహరించడమే ప్రమాణ మయ్యే పక్షంలో చంద్రశేఖర్ ప్రధాని పదవికి తగిన వ్యక్తి! జనతాదళ్ నాయకుడు విశ్వనాథ ప్రతాప్ సింగ్ ప్రధానిగా వున్న పదకొండు నెలల కాలంలో వ్యక్తిగత అవసరాల కోసం ఇరవై లక్షల రూపాయిలను విమాన ప్రయాణం కోసం ఖర్చు చేశారు. అంటే రోజుకు ఆరు వేల అరవై రూపాయలన్నమాట. స్వయాన పైలెట్ అయిన దివంగత రాజీవ్‌గాంధి తాను అధికారంలో వున్నప్పుడు 21 నెలల వ్యవధిలో నాలుగు కోట్ల పదమూడు లక్షలు ఖర్చు చేశారు. అంటే సగటున రోజుకు 65,555 రూపాయిలన్నమాట. ప్రధాన పదవీ వ్యామోహుడైన చంద్రశేఖర్ అందరి కంటే ఒక ఆకు ఎక్కువే చదివారన్న సంగతి తెలిసిందే. ఆయన పదవిలో వున్న ఐదు నెలల కాలంలోనే రాజీవ్, వి.పి. సింగ్‌లకు మించి విమానయానానికి వెచ్చించారు. ఆయన ఆ కాలంలో 4 కోట్ల 58 లక్షల రూపాయిల ఖరీదు చేసే వ్యక్తిగత ప్రయాణాలు చేశారు. అంటే సగటున రోజుకు మూడు లక్షల ఐదు వేల రూపాయిలు పైనే.

శని బంగళా

న్యూఢిల్లీలోని మోతీలాల్ నెహ్రూ మార్గ్, తొమ్మిదో నెంబరు బంగళాలో ప్రవేశం కోసం కాంగ్రెస్ నాయకులెందరో తాపత్రయపడుతున్నారు. తొమ్మిది లక్కీ నెంబర్‌గా భావించడం ఇందుకొక కారణం. కానీ అంతకంటే ముఖ్యమైన కారణం మరొకటుంది. ఆ బంగళాలో మొన్న మొన్నటి వరకూ పి.వి. నరసింహారావు వున్నారు. అది అచ్చి వచ్చే బంగళా అని, దాంట్లో వుంటే భవిష్యత్తు బంగారమేనని కాంగ్రెస్ పెద్దలు తలపోస్తున్నారు. బంగళాల కేటాయింపు వ్యవహారాలు చూసే పట్టణాభివృద్ధి శాఖా మంత్రి శీలా కౌల్ ఆ బంగళాను తనకే అట్టిపెట్టుకోవాలనుకుంటున్నారు. పోతే, తన జ్యోతిష్కుల సలహా మేరకు జంతర్ మంతర్ రోడ్డులోని మూడవ నెంబర్ బంగళాను నారాయణదత్ తివారీ ఖాళీ చేశారు. ఆ బంగళాలో వున్న కాలంలోనే తివారీ లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోవడమే కాక దేశ రాజకీయాల్లో ప్రాతినిధ్యాన్ని కోల్పోయారు. దాంతో ఆ బంగళా వేపు తలెత్తి చూసేందుకు సైతం చాలా మంది భయపడుతున్నారు. తివారికి మునుపు ఈ బంగళాలో ప్రణబ్ ముఖర్జీ వున్నారు. ఆ కాలంలో తివారి లాగే ముఖర్జీకి రాజకీయ గ్రహణం పట్టింది. వీరిద్దరి అనుభవాలు చూసిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు 'రోడ్డు మీదయినా వుంటాం కానీ ఆ బంగళా కావాలని అడగం' అంటున్నారు.